www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 197 ఆదివారం 08 - 12 - 2024 ఎడిటర్ : పి. జయరాం పేజీలు : 8 వెల : 4

## పఠాన్ చేరు లో ప్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మించండి
## చీఫ్ ఇంజనీర్ కు ఎమ్మెల్యే జి ఎం ఆర్ విజ్ఞప్తి



3

## మోదీని చంపుతామంటూ మెసేజ్



తొలిఅడుగు, ముంబై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని చంపుతామంటూ ముంబై పోలీసులకు శనివారంనాడు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి ఫోన్ కాల్ వచ్చినట్టు గుర్తించామని, నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు బృందాన్ని వెంటనే అక్కడికి పంపామని అధికారులు తెలిపారు. అధికారుల కథనం ప్రకారం, ముంబై ట్రాఫిక్ పోలీసు హెల్ప్‌లైన్‌కు శనివారం ఉదయం వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ప్రధాని మోదీని టార్గెట్‌గా చేసుకుని ఇద్దరు ఐఎస్ఐ ఏజెంట్లు బాంబు పేలుడుకు పథకం వేసినట్టు ఆ మెసేజ్‌లో ఉంది. దీంతో అప్రమత్తమైన అధికారులు నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని అజ్మీర్‌కు పంపారు. మెసేజ్ పంపిన వ్యక్తి మానసిక స్థిమితం

2

## హిందూ ఆలయాలపై దాడులు

తొలిఅడుగు, ఢాకా: పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ ఆలయాలపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా మరో ఇస్కాన్ కేంద్రానికి దుండగులు నిప్పుపెట్టారు. అందులోని దేవుడి విగ్రహాలను ధ్వంసం చేశారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా జిల్లాలో ఈ సంఘటన జరిగినట్లు ఇస్కాన్ కోల్‌కతా వైస్ ప్రెసిడెంట్ రాధారామన్ దాస్ తెలిపారు. శనివారం తెల్లవారు జామున 2-3 గంటల సమయంలో

2




## రోదసిలో పుతిన్ రహస్య ఆయుధం



తొలిఅడుగు డెస్క్ : మాస్కో: రష్యాకు చెందిన రహస్య ఉపగ్రహం 'కాస్మోస్ 2553' ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నది. ప్రస్తుతం డమ్మీ వార్‌హెడ్ (ఆయుధం)తో భూకక్ష్య వెలుపలి హద్దుల్లో సంచరిస్తున్న ఈ ఉపగ్రహం సాయంతో మున్ముందు క్షిపణులను, అణ్వాయుధాలను ప్రయోగించి శత్రు దేశాలకు చెందిన పలు కీలక ఉపగ్రహాలను నాశనం చేసేందుకు రోదసిలో రష్యా ఓ ప్లాట్‌ఫామ్‌ను

2

## అత్యవసరమైతే ట్యాపింగ్!



తొలిఅడుగు, న్యూఢిల్లీ : అత్యవసర పరిస్థితుల్లో ఐజీ లేదా ఆ పైస్థాయి పోలీసు అధికారి ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు జారీ చేయవచ్చని కేంద్రప్రభుత్వం

2



# అడ్డగోలు మాటలొద్దు



- కేసీఆర్ తరహాలో మీరూ నోరు జారొద్దు
- ఉద్యోగాలిస్తే ఢిల్లీలో క్షమాపణ చెబుతా
- ప్రధాని మోదీకి ఇదే నా సవాల్
- బీఆర్ఎస్, కేసీఆర్‌ని నకలు కొడుతున్న ఈటల, కిషన్‌రెడ్డి
- నల్లగొండ బహిరంగ సభలో సీఎం రేవంత్

తొలిఅడుగు, నల్లగొండ : అడ్డగోలుగా మాట్లాడొద్దు అంటూ సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ జాతీయ అధ్యక్షుడిని శనివారం నల్లగొండ బహిరంగ సభలో హెచ్చరించారు. కేసీఆర్ తరహాలో మాట్లాడొద్దంటూ హితవు పలికారు. "నడ్డా తెలంగాణ గడ్డ మీద అడ్డగోలుగా

2

## గంజాయి, డ్రగ్స్‌పై ఫోకస్



తొలిఅడుగు,ఖమ్మం:విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా పోలీస్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం నగరం లో మామిళ్ళగూడెం, సారథి నగర్ కాలనీల ను అనుసంధానం

2

## తండ్రీ కూతురికి ఒకేసారి 'లా' పట్టా



తొలిఅడుగు, మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఎలిగేటి శ్రీనివాస్, ఆయన కూతురు కావ్య ఇద్దరు ఒకేసారి ఎల్ఎల్‌బీ కోర్సు పూర్తి చేశారు. అంతే కాకుండా, తెలంగాణ బార్ కౌన్సిల్‌లో ఇద్దరు ఒకే రోజు శనివారం ఎన్రోల్‌మెంట్ చేసుకున్నారు. 50 ఏళ్ల వయసున్న శ్రీనివాస్ మెట్‌పల్లి

2

## తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టను ఆపాలని పిటిషన్

తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహ వివాదం ముదురుతూనే ఉంది. బతుకమ్మ లేకుండా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మేధావులు గళం విప్పుతున్నారు.




2

## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కేసీఆర్‌కు ఆహ్వానం

తొలిఅడుగు, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన జరిగే.. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ బృందానికి మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వంశిధర్ రావు తదితరులు సాదర స్వాగతం పలికారు. తన నివాసానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లంచ్ ఆతిథ్యమిచ్చి కేసీఆర్ గౌరవించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఉద్యమ జ్ఞాపకాలను ఇరువురు నేతలు నెమరు వేసుకున్నారు.



## మోదీని చంపుతామంటూ మెసేజ్



మొదటిపేజీ తరువాయి కోల్పోవడం కానీ, మద్యం తాగిన మైకంలో కానీ ఉండవచ్చని అనుమానిస్తున్నారు. భారతీయ న్యాయసంహితలోని సంబధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. ముంబై పోలీస్ హెల్ప్‌లైన్‌కు బాంబు బెదిరింపు మెసేజ్‌లు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఇలాంటి బెదిరింపు మెసేజ్‌లు రావడం, అవి ఉత్తవేనని తేలడం జరిగింది.

## హిందూ ఆలయాలపై దాడులు

మొదటిపేజీ తరువాయి నామ్‌హట్టాలో ఇస్కాన్ కేంద్రం పరిధిలోని రాధా కృష్ణ దేవాలయం, మహాభాగ్య లక్ష్మీ నారాయణ ఆలయానికి దుండగులు నిప్పు పెట్టినట్లు తెలిపారు. ఆలయం పైకప్పులను తొలగించి లోపల పెట్రోల్ పోసి నిప్పంటించారని చెప్పారు. దీంతో విగ్రహాలతోపాటు ఇతర వస్తువులు మంటల్లో కాలి ధ్వంసమయ్యాయని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, బంగ్లాదేశ్‌లోని ఇస్కాన్ కేంద్రాలపై దాడులు కొనసాగుతున్నాయని రాధారామన్ దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దేశంలోని తాత్కాలిక ప్రభుత్వం దృష్టికి ఈ దాడుల విషయం తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని విమర్శించారు. తమ ఆవేదన తగ్గించేందుకు, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పోలీసులు ఏమీ చేయడం లేదని ఆరోపించారు.

## రోదసిలో పుతిన్ రహస్య ఆయుధం

మొదటిపేజీ తరువాయి అభివృద్ధి చేస్తున్నట్టు భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతరిక్షంలో రష్యా మోహరించే ఆయుధానికి సంబంధించిన విడిభాగాలను ఈ ఉపగ్రహం పరీక్షిస్తున్నట్టు తాము భావిస్తున్నామని, దీని వల్ల ఎదురయ్యే ముప్పును తమ స్పేస్ కమాండ్ నిరంతరం పరిశీలిస్తున్నదని అమెరికా అధికారులు 'న్యూయార్క్ టైమ్స్' పత్రికకు తెలిపారు. రష్యా సైనిక బలగాలను ఉక్రెయిన్‌లోకి పంపడానికి కొన్ని రోజుల ముందు (2022 ఫిబ్రవరిలో) రష్యాలోని ప్లెసెట్స్ కాస్మోడ్రోమ్ నుంచి సూయజ్-2 రాకెట్ ద్వారా 'కాస్మోస్ 2553'ను నింగిలోకి పంపారు. అనంతరం ఆ ఉపగ్రహాన్ని దిగువ భూకక్ష్య చివరి అంచున (భూమికి దాదాపు 2 కి.మీ. ఎత్తున) చేర్చారు. ఆ ప్రాంతమంతా వాన్ అలెన్ బెల్ట్స్ నుంచి వచ్చే రేడియో ధార్మికతతో సంతృప్తమై ఉంటుంది. ఇది ఉపగ్రహ భాగాలను నిర్వీర్యం చేస్తుంది. పనికిరాని లేదా నిలిపివేసిన ఉపగ్రహాలను నిశ్శబ్ధంగా వాటంతట అవే నాశనమయ్యేలా చేసేందుకు దూరంగా ఆ ప్రాంతంలోకి పంపుతారు. దీంతో ఆ ప్రాంతాన్ని 'శ్మశాన కక్ష్య' అని పిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కాస్మోస్ 2553'ను ఆ కక్ష్యలో నిలపడం అమెరికా ఖగోళ పరిశీలకుల్లో అనుమానాలను పెంచుతున్నది.

## తండ్రీ కూతురికి ఒకేసారి 'లా' పట్టా

మొదటిపేజీ తరువాయి పట్టణంలో ఫ్లెక్సీ షాప్ నిర్వహిస్తూనే శాతవాహన యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పట్టా తీసుకున్నారు. ఆయన కూతురు కావ్య న్యూఢిల్లీలోని సెంట్రల్ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందింది. కాగా, ఒకే సారి తండ్రీకూతురు న్యాయవాదులు కావడంతో పలువురు అభినందించారు.

## తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టను ఆపాలని పిటిషన్

మొదటిపేజీ తరువాయి రేవంత్ రెడ్డి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నారు. నూతన తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ప్రముఖ రచయిత జూలూరి గౌరీ శంకర్ హైకోర్టును ఆశ్రయించారు. డిసెంబర్ 9న సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టను ఆపాలని పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులను తెలంగాణ ప్రజలు, మేధావులు, రచయితలు,కవులు, కళాకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విగ్రహంలో మార్పులు అంటే తెలంగాణ అస్తిత్వం జరుగుతున్న దాడిగా తెలంగాణ సమాజం భావిస్తుంది.

# గంజాయి, డ్రగ్స్‌పై ఫోకస్

మొదటిపేజీ తరువాయి చేసే రైల్వే అండర్ మినీ బ్రిడ్జిని ఇవాళ(శనివారం) మంత్రి తుమ్మల ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... ఖమ్మం నగరంలో ట్రాఫిక్ కష్టాలు లేకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్నపుడు అండర్ బ్రిడ్జిని తాను శాంక్షన్ చేశానని.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నపుడు శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. ప్రజా పాలన ఏడాదిలో అర్.యుబీ ప్రారంభోత్సవం చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలో విశాలమైన రహదారులు, పార్క్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. 500 ఎకరాలు ఉన్న వెలుగుమట్ల పార్క్‌ను ఖమ్మం నగరానికి పర్యాటక ప్రదేశంగా ల్యాండ్ మార్క్‌గా అభివృద్ధి చేశానని తెలిపారు. ఖమ్మం చరిత్ర తెలిపేలా ఖిల్లాపై రోప్‌వే ఏర్పాటుతో పర్యాటక అభివృద్ధి చెందుతుందని అన్నారు. పెరుగుతున్న అర్బన్ పాపులేషన్‌కు తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. ఖమ్మం నగరం పరిశుభ్రంగా విశాలమైన రహదారులు పచ్చదనంతో ఇతర నగరాలకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. నాలాలు పూడ్చి అక్రమ కట్టడాలు నిర్మించడం వల్లే మున్నేరుకు వరద ముంపు గండం వచ్చిందని చెప్పారు. అడవులను కొట్టడం వల్లే కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. ఖమ్మం విప్లవాల పురిటిగడ్డ అన్నారు. స్వాతంత్ర సంగ్రామంలో నైజాం రజాకార్లను తరిమి కొట్టిన జిల్లా ఖమ్మం జిల్లా అని ఉద్ఘాటించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో తనకు మంత్రిగా అవకాశం ఇచ్చిన ఖమ్మం ప్రజలకు తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

# అడ్డగోలు మాటలొద్దు



మొదటిపేజీ తరువాయి మాట్లాడవద్దు. ప్రధాని మోదీనీ సవాల్ చేస్తున్నా. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యంలో ఏడాదిలో 55,143 ఉద్యోగాలు ఇచ్చాం. మీ పార్టీ 23 ఏళ్లుగా అధికారంలో ఉన్న, మీరే స్వయంగా 13 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న గుజరాత్‌లో ఇలా ఇచ్చారా? మీ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఒక్క ఏడాదిలో ఇన్ని ఉద్యోగాలిచ్చినట్లు నిరూపించగలరా? అలా నిరూపిస్తే, నేను ఢిల్లీ నడిబొడ్డున నిలబడి మీకు క్షమాపణ చెబుతా" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానికి సవాల్ చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో బ్రాహ్మణవెల్లంల-ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాన్ని, దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ యూనిట్-2లో విద్యుత్తు ఉత్పత్తిని రేవంత్ ప్రారంభించారు. నల్లగొండలో వైద్య కళాశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నల్లగొండలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, ఈటల.. కేసీఆర్, బీఆర్ఎసని నకలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. "ఈటల, కిషన్‌రెడ్డీ.. మీరు మారండి. దొంగల సోపతి పట్టి దొంగల బండి ఎక్కకండి.. మీకున్న గౌరవం పోగొట్టుకోకండి" అని రేవంత్ పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దివాలా తీయించారని, వారి హయాంలో చేసిన అప్పులను క్రమపద్ధతిలో తీర్చు తూ, ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. అధికారంలో ఉంటే ఉప్పొంగడం, లేకపోతే కుంగిపోవడం తగదని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా.. తాము జనంలోనే ఉన్నామని, ప్రజల తరఫున పోరాడామని.. కేసీఆర్‌లా ఫాంహౌసలో విశ్రాంతి తీసుకోలేదని చెప్పారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన పాత్ర పోషించాలని, ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. పాలనలో లోపాలుంటే విమర్శించాలని సీఎం ఆహ్వానించారు. కాంగ్రెస్ నేతలు ఎవరూ ఇలా సభకు రాకుండా పోలేదన్నారు. నాడు ప్రతిపక్ష నాయకుడిగా జానారెడ్డి సభలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి సూచనలు, సలహాలిచ్చారని.. దారితప్పిన రోజు నిలదీసి పోరాడారని గుర్తుచేశారు. మా ఎమ్మెల్యేలను గుంజుకున్నా మల్లు భట్టి విక్రమార్క సీఎల్పీ నేతగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహా పంచపాండవులను వెంటబెట్టుకొని మీపై ధైర్యంగా పోరాడారని, నిలదీశారని, సలహాలిచ్చారని రేవంత్ చెప్పారు.

# అత్యవసరమైతే ట్యాపింగ్!

మొదటిపేజీ తరువాయి స్పష్టం చేసింది. ఈ మేరకు ఫోన్ ట్యాపింగ్ తాజా నిబంధనలను జారీ చేస్తూ కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ శుక్రవారం ఓ నోటిఫికేషన్‌ను వెలువరించింది. ట్యాపింగ్‌కు ఆదేశాలు జారీ చేసిన అధికారి ఏడు పని దినాల్లో సదరు ఆదేశాలు నిజమైనవేనని నిర్ధారించకపోతే.. ట్యాపింగ్ ద్వారా సేకరించిన వివరాలను దేనికీ ఉపయోగించవద్దని ఈ నిబంధనల్లో పేర్కొన్నారు. రెండు పనిదినాల్లో ఆ వివరాల తాలూకు పత్రాలను ధ్వంసం చేయాలని స్పష్టం చేశారు. ఏదైనా మారుమూల ప్రాంతంలో ఫోన్ ట్యాపింగ్ కోసం ఆదేశాలు జారీ చేయటానికి సంబంధిత అధికారికి సాధ్యం కాకపోతే, ఆ అధికారి తర్వాత స్థానంలో ఉన్న అధికారి (ఐజీ ర్యాంకుకు తగ్గని వారు) ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపారు. సదరు అధికారి కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలకు చెంది నవారై ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ట్యాపింగ్ ఆదేశాలను కేంద్రస్థాయిలోనైతే క్యాబినెట్ కార్యదర్శి, న్యాయశాఖ, టెలికాం శాఖల కార్యదర్శులతో కూడిన కమిటీ సమీక్షించాల్సి ఉంటుందని..



రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ కార్యదర్శి, న్యాయ, హోంశాఖల కార్యదర్శులతో కూడిన కమిటీ సమీక్షించాలని కేంద్రం స్పష్టం చేసింది.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# పఠాన్ చేరు లో ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మించండి చీఫ్ ఇంజనీర్ కు ఎమ్మెల్యే జి ఎం ఆర్ విజ్ఞప్తి



తొలిఅడుగు, పటాన్ చెరు: పటాన్చెరులో ఫ్లై ఓవర్ నిర్మించండి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ మధుసూదన్ రెడ్డికి ఎమ్మెల్యే జిఎంఆర్ విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పటాన్చెరు పట్టణంలో వ్యాపారస్తులకు, స్థానికులకు నష్టం వాటిల్లకుండా ఫ్లై ఓవర్ నిర్మించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ మధుసూదన్ రెడ్డికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాదులోని ఆర్ అండ్ బి. కార్యాలయంలో. సీఈ మధుసూదన్ రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.. ఈ సందర్భంగా పటాన్చెరు నియోజకవర్గం లో చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మియాపూర్ నుండి పటాన్చెరు వరకు చేపడుతున్న ఆరు వరసల జాతీయ రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో.. విస్తరణ మూలంగా పటాన్చెరువు పట్టణంలో వ్యాపార సంస్థలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఇది అంశంపై అప్పటి సీఈ గణపతి రెడ్డికి సైతం విజ్ఞాపన పత్రాన్ని అందించడంతోపాటు, పటాన్చెరు పట్టణంలో స్వయంగా పర్యటించడం జరిగిందని తెలిపారు. రహదారి విస్తరణ మూలంగా వ్యాపారస్తులకు, స్థానికులకు నష్టం కలగకుండా ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరారు. ఎందుకు సానుకూలంగా స్పందించిన సీఈ మధుసూదన్ రెడ్డి.. ఈ అంశాన్ని జాతీయ రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి. నితిన్ గడ్కారీ దృష్టికి తీసుకొని వెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జిఎంఆర్ వెంట పటాన్చెరు పట్టణానికి సంబంధించిన వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# పట్టాలు లేవంటూ.. డబుల్ ఇండ్లకు విద్యుత్ నిలిపివేత



తొలిఅడుగు, హైదరాబాద్ : కీసరలోని డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు ఇంటి పట్టాలు లేవంటూ.. విద్యుత్‌ను నిలిపివేశారు అధికారులు. దీంతో లబ్ధిదారులు నేరుగా మండల తహసీల్దార్ అశోక్‌కుమార్‌ను కలిసి..ఇంటి పట్టాలు ఇవ్వాలంటూ.. వినతిపత్రాన్ని అందజేశారు. లబ్ధిదారులకు ఇంటి పట్టాలు లేనందున విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని విద్యుత్ అధికారులు హెచ్చరిస్తున్నారని, ఇండ్లు కేటాయించిన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు.

## విలీనం వద్దే వద్దు మా ఊరు మాకు ముద్దు..



తొలిఅడుగు, హైదరాబాద్ : ఒక చారిత్రక తప్పిదం.. ఒక విలీనం.. 60 ఏండ్ల గోసకు కారణమైంది. కొట్లాడి తెచ్చుకుంటే స్వేచ్ఛావాయువులు లభించాయి. ఇప్పుడు గ్రేటర్‌లో మరో విలీనం కలకలం రేపుతున్నది. మరో విప్లవానికి శ్రీకారం చుడుతున్నది. కత్తి పక్కోడిది అయినా పొడిచేది మనోడే అన్నట్టు.. కాంగ్రెస్ సర్కారు పల్లెవాసులపై కత్తికట్టింది. భారీ కుట్రలకు తెరలేపింది. సాధారణ పల్లెవాసులు ఈ విలీనం వద్దే వద్దు.. మా గ్రామమే మాకు ముద్దు అని మొత్తుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో హడావిడిగా ఆర్డినెన్స్ జారీ చేసింది. హైదరాబాద్ చుట్టుపక్కల విస్తరించి ఉన్న ఔటర్ రింగు రోడ్డు పరిధిలో 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అక్కడితో ఆగకుండా పక్కావ్యూహంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి తీసుకువచ్చే ప్రణాళికలను గుట్టు చప్పుడు కాకుండా అమలు చేస్తున్నది. ప్రభుత్వ మొండివైఖరిపై పల్లెల్లో మరో ఉద్యమం ఊపందుకుంటున్నది. సర్కారు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మరో విప్లవాన్ని సృష్టిస్తామని విలీన గ్రామల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# బచ్చు గూడెం లో ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు

**– హాజరైన ఫిషరీస్ సొసైటీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్**



తొలిఅడుగు, పటాన్ చెరు : ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను కొనసాగిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం పటాన్ చెరు మండలం బచ్చుగూడ గ్రామపంచాయతీ పరిధిలో పటాన్చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవాలకు తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ సొసైటీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మెట్టు సాయి కుమార్, నీలం మధు ముదిరాజ్, కాట శ్రీనివాస్ గౌడ్ తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్ల పాటు నిర్లక్ష్యం చేసిన అన్ని వర్గాలకు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ఏడాదిలోనే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తన మార్కు పాలనను చూపిస్తూ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని విడతల వారీగా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ రెండు లక్షల వరకు రుణమాఫీని పూర్తి చేశామని, సంక్రాంతి సందర్భంగా పెట్టుబడి సహాయమైన రైతు భరోసాను సైతం జమ చేస్తామని తెలిపారు. పదేండ్ల పాటు గత ప్రభుత్వం నిరుద్యోగులను గాలికొదిలేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఏడాదిలోనే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని కొనియాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా బీసీ కులగణన చేపట్టి బీసీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించే విధంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు.

# రేపు మేడ్చల్‌జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

**– హాజరుకానున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**





మేడ్చల్, తొలిఅడుగు, : : మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ సమీపంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఈ నెల 9న ప్రారంభించనున్న నేపథ్యంలో శంభీపూర్ రాజు శనివారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరు కానున్నట్లు చెప్పారు. కేటీఆర్‌తో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, రాజ్యసభసభ్యులు, పార్టీ రాష్ట్ర నాయకులు హాజరువుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని శంభీపూర్ రాజు విమర్శించారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అణిచివేతలు, అరాచకాలు, కూల్చివేతలు, జైళ్లు, కేసులు తప్ప..ఏమీ లేవని చెప్పారు. ప్రజాపాలన కాదని.. తెలంగాణలో రాక్షస పాలన కొనసాగుతున్నదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉన్న రోజులను తెలంగాణ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఏ పథకాన్ని అమలు చేయకుండానే ఏడాది పాలనపై వారోత్సవాలు చేసుకోవడంపై ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఛీ కోడుతున్నారని చెప్పారు. కాగా, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పరిశీలించారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేత



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 07 : సిద్దిపేట వాసవి క్లబ్ వనిత వారి ఆధ్వర్యంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి సహకారంతో దానంపల్లి గ్రామానికి చెందిన లాస్య అనే మహిళా జీవనోపాధి కోసం కుట్టు మిషన్ ను శనివారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం కార్యదర్శి మంకాల నాగరాణి మాట్లాడుతూ... జీవనోపాధి కోసం కుట్టుమిషన్ అందించడం గొప్ప విషయమని అధ్యక్షురాలు వాణి ఈ సంవత్సరం ఇంటర్నేషనల్ వారు ఇచ్చిన ప్రతీ ఒక్క టాస్క్ తో పాటు పర్మనెంట్ ప్రాజెక్టు లో భాగంగా బీరువాలు, వాటర్ ట్యాంకులు, ఐరన్ రాక్స్, పుస్తెమట్టెలు, అన్నప్రసాద వితరణ, అమ్మవారి మండల పారాయణం, గో సేవ లాంటి కార్యక్రమాలు నిర్వహించినందుకు జిల్లా గవర్నర్ భానూరి నర్సింలు నుండి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు తీసుకున్నందుకు అభినందనలు తెలుపుతూ వారి కుటుంబానికి శ్రీ వాసవి మాతా ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యక్రమాల బాధ్యులు మంకాల నవీన్ కుమార్, అధ్యక్షురాలు మర్యాల వాణి, రూప, స్వాతి, హరినాధ శర్మ, బాలరాజేశం, విట్టల్, రమేష్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.


## ఉచిత వైద్య శిబిరం వినియోగించుకోవాలి




తొలి అడుగు, చిన్నకోదూర్, డిసెంబర్ 07 : : శనివారం సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సురభి మెడికల్ కళాశాల మిట్టపల్లి వారి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు మండలంలోని విఠలాపూర్ గ్రామంలోఉచిత కంటి శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సురభీ హాస్పిటల్ పీఆర్వో పరుశరాములు మాట్లాడుతూ... సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచితంగా అందిస్తున్నటువంటి కంటి శిబిరం సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అలాగే హాస్పటల్లో గల వైద్య సేవలను కూడా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విఠలాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ నవీన్, ఎంపీటీసీ సాగర్ రెడ్డి, గ్రామ సెక్రెటరీ రాకేష్, గ్రామ పెద్దలు సత్యనారాయణ రెడ్డి, తెనుగువారి పల్లి మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, సురభి హాస్పిటల్ మేనేజ్మెంట్ వెంకటేశ్వరరావు, మరియు మర్కెటింగ్ బృందం పాల్గొన్నారు. ఈ కంటి శిబిరంలో గ్రామ ప్రజలు సుమారు 250 పై చిలుకు ప్రజలు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంటి పరీక్షలు,మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఆపరేషన్ అవసరం ఉన్న వారిని హాస్పిటల్ కి రెఫెర్ చేసి ఆపరేషన్లు చేయడం జరుగును. కంటి సంబంధిత వైద్య నిపుణులు నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## చిన్నకోడూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిగా ఐశ్వర్య బాధ్యతలు స్వీకరణ

తొలి అడుగు, చిన్నకోడూర్, డిసెంబర్ 07 : చిన్నకోడూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా డాక్టర్ ఐశ్వర్య శనివారం రోజు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న డాక్టర్ సరిత విధులు నిర్వహించిన రాజగోపాల్ పేటకు బదిలీ కావడంతో గజ్వేల్ ఆర్.ఎన్.ఆర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన డాక్టర్.ఐశ్వర్య చిన్నకోడూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మండలంలోని ఆయా గ్రామాలలో మలేరియా, డెంగ్యూ వైరస్ ఫీవర్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.



## తాజా మాజీ సర్పంచ్ సత్తయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన జెఎస్ఆర్




తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 07 : హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలం బస్వాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య అమ్మ ఎడబోయిన వీరమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేఎస్ఆర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పుల్లూరి నవీన్ చారి,శ్యామల గిరిధర్, బానోతు సురేష్ నాయక్,గాదాసు భాస్కర్,ఆసాని నరేందర్,తాటిపాముల తిరుపతి గౌడ్,సురేష్ గౌడ్, కొమ్మడబోయిన రమేష్,వేముల శ్రీపాల్,తుపాకుల శివాజి,తాటిపాముల దనుష్ తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డగా వేల్పుగొండ పాఠశాల

- స్మోకింగ్ స్పాట్‌లుగా పాఠశాల- - మద్యం తాగుతూ నానా విధ్వంసం సృష్టిస్తున్న మందుబాబులు



టేక్మాల్ డిసెంబర్ 07 తొలి అడుగు : విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పే పాఠశాలలో కొందరు ఆకతాయిలకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మద్యం ప్రియులకు పర్మిట్ రూమ్ గా తయారవుతున్నాయి. బయట ఎక్కడో కూర్చోని తాగితే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే పోలీసులు కేసులు పెడతారని ఆలోచన చేస్తు పాఠశాలలనే మద్యం తాగడానికి ఆవాసాలుగా చేసుకుంటున్నారు. విద్యాలయాలు ఆధునిక దేవాలయాలు అని మర్చిపోతూ పాఠశాలనే, స్మోకింగ్ స్పాట్‌లుగా మార్చేస్తూనారు. గతంలో గుర్తుతెలియని దుండగులు పాఠశాల కిటికీలు, దర్వాజాలు, బల్లలను విరగ్గొట్టి సౌండ్ బాక్సులు, అంప్లీవేయర్, కంప్యూటర్లు, దొంగతనం చేశారు. పాఠశాలలు విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు లేకుండా చేస్తున్నారు. విద్య కోసం కోట్లు ఖర్చులు చేస్తున్న ప్రభుత్వం వాటిని సంరక్షించేందుకు వాచ్‌మెన్‌లను మాత్రం నియమించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉపాధ్యాయులు,విద్యార్థులు ఉన్నారనే కనీస ఆలోచన చేయకుండా పాఠశాల ఆవరణలో సిగరెట్లు,మద్యం తాగడం చేస్తు ఆకతాయిలు జల్సాలు చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.





## సోమవారం జరిగే ప్రజావాణి వాయిదా




తొలి అడుగు, సిద్దిపేట జిల్లా,డిసెంబర్ 07 : డిసెంబర్ 9 వ తేదీ సోమవారం నాడు వ్యవసాయ మరియు ఉద్యాన శాఖలకు చెందిన క్రిషికల్ప మరియు "అగ్రిసినర్జీ 2024" కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నందున సోమవారం నాడు కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మంగళవారం నాటికి వాయిదా వేసినట్టు జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమానికి రావాలనుకునే వారు మంగళవారం నాడు నిర్భహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి సమస్యల పరిష్కారానికి అర్జీలు పెట్టుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలను ఆ ప్రకటనలో కోరారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# తొలి ఏడాదిలోనే అపూర్వ విజయాలు

**- 6 గ్యారంటీలో అమలు చేసి మరింత చేరువైన ప్రజా ప్రభుత్వం.**

తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 07 : అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కి, మంత్రులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక శుభాభినందనలు తెలుపుతున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా పాతూరి వెంకటస్వామి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడి తొలి ఏడాదితో అపూర్వ విజయాలను సాధించిందని తెలియజేశారు. 25 లక్షల మంది రైతులకు 21000 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు. నిరుద్యోగుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడి తొలి ఏడాదిలోనే 55143 ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి దేశంలోని ఒక సంవత్సరంలో అత్యధిక ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రంగా చరిత్ర సృష్టించి నిరుద్యోగుల ఆశయాలు నెరవేర్చిందని తెలియజేశారు. రాష్ట్రంలో పది లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నది తెలిపారు. పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తూ ఐదు లక్షల ఉన్న ఆరోగ్యశ్రీని 10 లక్షల కు పెంచిందని అలాగే సీఎంఆర్ఎఫ్ ఫండ్ ద్వారా తొలి ఏడాది 839 కోట్లు ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రజా ప్రభుత్వం దక్కుతుందని తెలిపారు. అలాగే ప్రతి పేద కుటుంబానికి 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్లను ఇస్తుందని తెలియజేశారు. రాష్ట్రంలోని మహిళలందరూ యాడాదికాలంగా బస్సులో ఉచిత ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్నటువంటి 39వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలను, మోడల్ స్కూల్ లకు ఉచిత విద్యుత్తును అందిస్తున్న ఘనత ఈ ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని తెలియజేశారు. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమ, విద్య, వైద్య అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు మేలు చేసే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ఉంటే ఒకవైపు బిఆర్ఎస్, బిజెపి నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని




తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ మీరు ఒకసారి ఆలోచన చేయండి. గతంలో రాష్ట్రంలో 10 సంవత్సరాలు పరిపాలించిన బిఆర్ఎస్ పార్టీ మిగులు రాష్ట్రంగా ఉన్న రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల రూపాయల అప్పుల పాలు చేసి తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణగా ఏర్పడుతుందని బూటకపు మాటలు మాట్లాడిందని అలాగే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా తెలంగాణపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందని తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి నాయకులు ఈ ప్రభుత్వం పైన చేస్తున్న విమర్శలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పి ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మరింత ప్రయోజనం పొందాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అక్బర్ పేట భూంపల్లి తాజా మాజీ ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి బాలా గౌడ్, ఖాజీపూర్ తాజా మాజీ సర్పంచ్ పెరిక మధు, మండల మహిళా అధ్యక్షురాలు కూతురి సుమలత, మండల యూత్ అధ్యక్షులు అబ్బుల లోకేష్ గౌడ్, సిద్దిపేట జిల్లా మీడియా కమ్యూనికేషన్ కో కన్వీనర్ షేర్ పల్లి తరుణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉత్తమ నరేష్, బాల్తే వెంకటేశం,కూతురి చందు, ఎల్లన్న గారి సురేందర్ రెడ్డి, ఏనగంటి చంద్రం, కడవెరుగు నగేష్, గుర్రాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ నీతి నిజాయితితో విధులు నిర్వహించాలి

**- అంకిత భావంతో స్టేషన్‌కు వచ్చిన బాదితులకు భరోసా కల్పించాలిలి - అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి**





తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 07 : పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ ఆదేశానుసారం ప్రొబిషనరీ సివిల్ కానిస్టేబుల్ లకు వారం రోజులపాటు రైటర్ , కోర్టు డ్యూటీ, భరోసా, సఖి, షిటీమ్ , రిసెప్షన్, %జబుచీూ%, బీట్ సిస్టం, వెహికల్ చెకింగ్, కార్డన్ అండ్ సెర్చ్, డయల్ -100 కాల్స్ అటెండ్, ఔట్ డోర్ ట్రైనింగ్, బందోబస్తు మరియు జిల్లా పోలీస్ కార్యాలయంలోని వివిధ విభాగాల గురించి ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్ మరియు ఐటీ కోర్ సిబ్బంది శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరనున్న కానిస్టేబుళ్లకు బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని దిశానిర్దేశం చేశారు. మీరు పోలీస్ కాక ముందు బాధితుడికి పోలీస్ ఏలాంటి న్యాయం కావాలని ఆశించారో ఇప్పుడు మీ నుండి బాధితులు ఆ విధంగా న్యాయం కావాలని ఆశిస్తారని వాటిని నెరవేర్చే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలన్నారు. పోలీసు శాఖలో పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిని ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికా కుండా నీతి నిజాయితీతో విధులు నిర్వహిస్తే ప్రజలు మన్ననలు పొందుతారని సూచించారు.పోలీస్ శాఖలో ఉద్యోగం అంటేనే అనేక సవాళ్లతో కూడుకున్న ఉద్యోగమని మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. పోలీస్ జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనదని, అధికారులు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసుల ముఖ్య విధి ప్రజల ధన,మాన, ప్రాణ, రక్షణ ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. పోలీసు శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని, అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని అంకిత భావంతో సేవలందిస్తూ వృత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. నేరాల నియంత్రణ కొత్త టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీసులకు మంచి గుర్తింపు ఉన్నదని, చట్టబద్ధమైన పౌరులుగా మీ సేవలను చూసి సమాజం గౌరవించేలా ఉండాలన్నారు. నూతన చట్టాల గురించి ప్రతిరోజు చదువుకొని పట్టు సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, ఐటీ కోర్ సిబ్బంది, శ్రీకాంత్, రాజిరెడ్డి, స్వామి, రమేష్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలలో గెలుపోటములు సహజం

**- ఐపీఎస్ కాకుంటే క్రీడాకారుని అయ్యేవాన్ని**
**- సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి**



తొలి అడుగు, సిద్ధిపేట, డిసెంబర్ 07 : క్రీడాలలో గెలుపోటములు ముఖ్యం కాదు. పాల్గొనడమే ముఖ్యం. నేను క్రీడాకారుణ్ణే నేను చిన్నప్పటి నుండి క్రీడాల్లో పాల్గొనేవాన్ని. ఐఏఎస్ కాకుంటే క్రీడాకారుణ్ణి అయ్యేవాన్ని. ఇలాంటి క్రీడావేదికల్లో ఇతర ప్రాంతాల క్రీడాకారులతో పోటీ పడడంతో క్రీడాస్ఫూర్తి పెరుగుతుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుండి వచ్చిన క్రీడాకారులు 4 రోజుల నుండి యాక్టీవ్ గా, క్రమశిక్షణతో పాల్గొన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర కళలలో ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులు ఆయా రంగాలలో ప్రోత్సాహించాలి. జీవితంలో పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు ఇప్పటినుండే క్రమబద్ధంగా కృషి చేస్తే భవిష్యత్ లో ఉన్నంతంగా ఎదుగుతారు.

## వర్గల్ మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల లో స్టేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం..



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 07 : ముఖ్య అతిథిగా హాజరైన రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి పొన్నం ప్రభాకర్ నాలుగు రోజుల క్రీడా పోటీల్లో ఒకరోజు మొత్తం ఇక్కడే ఉండి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుందాం అనుకున్న సంవత్సర క్రితం కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి సంవత్సరం సెలబ్రేషన్స్ మీ అందరి సమక్షంలో జరుపుకుంటున్న ప్రభుత్వంలో తీసుకునే నిర్ణయాల్లో బాధ్యతగా ఉన్నాం. విద్యార్థి నాయకుడిగా నాకు అవకాశం ఉన్నప్పుడల్లా విద్యార్థుల సమస్యలు ,ఉపాధ్యాయుల సమస్యలు వారికి ప్రమోషన్లు మౌళిక వసతులు పై నా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న తెలంగాణ వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల 25 వేల పాఠశాలలకు 1100 కోట్ల తో మౌళిక సదుపాయాలు కల్పించాం ఉపాధ్యాయుల నియామకాలు చేశాం. 2010 నుండి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు లేవు. వారికి బదిలీ చేసి అసహనం తొలగించామన్నారు. విద్యార్థులకు ఎక్కడ ఇబ్బంది కలగకూడదని అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గురుకులాల్లో చల్లని నీళ్లతో స్నానం చేయద్దని వాటర్ హీటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సొంత భవనాల్లో గురుకులాలు ఏర్పాటు చేస్తున్నామని నాణ్యమైన ఆహారం అందించడానికి డైట్ కాస్మొటిక్ చార్జీలు పెంచామన్నారు. డైటీషన్ సలహాతో ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకుల సెక్రటరి లతో మెనూ ఏర్పాటు చేస్తామన్నారు. అద్దె భవనాల్లో అద్దెలు చెల్లించాం. భవిష్యత్ లో గురుకులాల్లో గ్రీన్ ఛానెల్ ద్వారా మెస్ ఛార్జీలు ఇస్తామన్నారు. 5 వేల కోట్లతో 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ తీసుకొస్తున్నట్లు తెలిపారు. అక్కడక్కడ ఫుడ్ పాయిజన్ కేసులు అవుతున్నాయని ఎక్కడైనా ఫుడ్ పాయిజన్ కేసులు అయినా నాణ్యమైన ఆహార పదార్థాలు ఉండాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎక్కడైనా ఇబ్బంది వస్తే అధికారులపై చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు వదిలి పిల్లలు ఇక్కడికి వస్తున్నారు. మన పిల్లలాగా చూసుకోవాలి మీ ఉజ్వల భవిష్యత్తు బాగుండాలంటే ఇప్పటి నుండే కష్టపడి చదవాలన్నారు. మన మేధాశక్తిని వృథా చేయవద్దన్నారు. దానికి పని పెట్టాలని అప్పుడే ఉన్నత శిఖరాలకి వస్తామన్నారు. అన్నింట్లో నెంబర్ వన్ గా ఉండాలన్నారు. లక్ష్యం పెట్టుకొని పని చేయాలని క్రీడలు, చదువుల్లో లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వం లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తున్నామని ఇప్పటి వరకు 116 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని తెలిపారు. అనంతరం ఆయన విజేతలకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన 17 మందికి 19,500/- వేల రూపాయల జరిమానాలి

తొలి అడుగు , సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 07 : సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, చౌరస్తాలలో మరియు రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా, 17 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా ఈరోజు సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి గారి ముందు హాజరుపరచగా విచారణ చేసి 17 మందికి ? 19,500/-వేల రూపాయల జరిమాన విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ కుమార్, మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎన్టీపిసి ఆర్ఎల్ఐ డిపార్ట్మెంట్ సబ్ ఆఫీషర్ రుగడ లక్ష్మీ గారు



తొలి అడుగు పరవాడ డిసెంబర్ 7 : మానవత్వం చాటుకున్న ఎన్టీపిసి ఆర్ఎల్ఐ డిపార్ట్మెంట్ సబ్ ఆఫీషర్ రుగడ లక్ష్మీ గారు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు కడపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి నూకాలమ్మ చెందిన కమ్మల ఇల్లు కాలిపోయింది ఈ మేరకు ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన విషయాన్ని సింహాద్రి ఎన్టీపిసిలో ఆర్ఎల్ఐ డిపార్ట్మెంట్ లో సబ్ ఆఫిషర్ గా పనిచేస్తున్న రుగడ లక్ష్మీ గారు దృష్టికి తీసుకు రావడంతో మానవత్వ దృక్పథంతో స్పందించి శుక్రవారం ఆమె పూడిమడక గ్రామం వెళ్ళి ఆమె సొంత నిధులతో ఇంటికి కావలసిన నిత్యావసర సరుకులు ఒక రైస్ బ్యాగ్,ఒక నూనె డబ్బా, మరియు మూడు వేల రూపాయలు నగదును ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన మైలపల్లి నూకలమ్మ కుటుంబానికి అందజేసి మానవత్వం చాటుకున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైలపల్లి లక్ష్మణ,గనగల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో లో ఓపెన్ హౌస్ కార్యక్రమం





తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 07 : సిద్దిపేట పట్టణంలో, సిద్దిపేట రూరల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 1500 మంది ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ మేడమ్ గారు స్వయంగా పిల్లలకు ఆయుధాల గురించి, పోలీసు చట్టాల గురించి, సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాల గురించి, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి మరియు సైబర్ నేరాల డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల గురించి వివరించారు. పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాల గురించి, ఏకే 47, ఎస్ఎల్ఆర్, కార్బన్, 9%ఎఎ% పిస్తాల్, బీడీ టీమ్, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్, షీటీమ్, భరోసా, కమాండ్ కంట్రోల్ రూమ్ సీసీ కెమెరాలు, రోడ్డు ప్రమాదాలు స్పీడ్ లేజర్ గన్, ట్రాఫిక్ రూల్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కిట్, డాగ్ స్క్వాడ్స్, సైబర్ క్రైమ్ తదితర స్టాల్స్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారులు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ డాక్టర్ బి అనురాధ ఐపీఎస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా డ్రగ్స్ రహిత జిల్లా గురించి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు మరియు ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని మరియు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు విద్యార్థినీ విద్యార్థులు స్వయంగా ఆయుధాల గురించి తదితర అంశాల గురించి వాటి పేర్లు అడిగి తెలుసుకున్నారు, ఉత్సవంగా విద్యార్థులు పాల్గొన్నారు మరియు సైబర్ నేరాలు సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయో మరియు జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి వీడియో ఆడియో రూపంలో ఎల్ఈడి స్క్రీన్ ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. మరియు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ రూమ్ రూమ్ లో ఉన్న సీసీ కెమెరాలను వాటి వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించడం జరిగింది. పోలీసు చట్టాలు పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి విద్యార్థినీ విద్యార్థులకు కమ్యూనికేషన్ విహెచ్ఎఫ్ సెట్ తదితర అంశాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి రోడ్డు నమూనా డయాగ్రామ్ వేసి రాంగ్ రూట్లో వస్తే ఎలా ప్రమాదాలు జరుగుతున్నాయి హెల్మెట్ పెట్టుకోకపోతే ఎలా ప్రమాదాలు జరుగుతున్నాయి మరియు జీబ్రాలయం తదితర అంశాల గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. మరియు బాలికలు మహిళల రక్షణకు ఏర్పాటుచేసిన భరోసా కేంద్రం యొక్క సేవల గురించి అవగాహన కల్పించడం జరిగింది. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, డయల్ 100, సైబర్ నేరం జరగగానే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ల గురించి కూడా అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, శ్రీధర్ గౌడ్,సిసిఎస్ ఇన్స్పెక్టర్ అంజయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పూర్ణచందర్, విష్ణు ప్రసాద్, రాజేష్, కార్తీక్, మరియు పోలీస్ అధికారులు సిబ్బంది వివిధ స్కూళ్ల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మండల గ్రామపంచాయతీల యందు ముసాయిదా చేయాలి



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 07 : 2వ, సాదారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు, 2024 భాగంగా, నేడు అనగా శనివారం సిద్దిపేట జిల్లాలోని 491 గ్రామ పంచాయతీలో 4350 ముసాయిదా పోలింగ్ స్టేషన్స్ జాబితా సంబందింత గ్రామ పంచాయతీల యందు, మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ కార్యాలయము ప్రచురణ చేయబడినది. అని డిపిఓ దేవకి దేవి అన్నారు.

## బిలియనీర్స్ ఏ భారత్

న్యూఢిల్లీ, తొలి అడుగు,: శ్రీమంతులు అడ్డాగా భారత్ మారిపోతున్నది. ప్రతియేటా దేశవ్యాప్తంగా బిలియనీర్లు గణనీయంగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరానికిగాను భారత్‌లో 185 మంది ఆగర్భ శ్రీమంతులు ఉన్నట్లు యూబీఎస్ తన నివేదికలో వెల్లడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే సంపన్నవర్గాలు 21 శాతం మంది పెరిగారని, వీరి మొత్తం సంపద 905.6 బిలియన్ డాలర్లు లేదా రూ.75.19 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నదని పేర్కొంది. నికరంగా వీరి సంపద 42 శాతం ఎగబాకిందని తెలిపింది. ప్రపంచ దేశాల శ్రీమంతుల జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉన్నదని వెల్లడించింది. 835 మందితో అమెరికా తొలిస్థానంలో నిలువగా, ఆ తర్వాతి స్థానంలో చైనా 427 మంది ఉన్నట్లు యూబీఎస్ తన తాజా బిలియనీర్ల నివేదికలో తెలిపింది. ప్రస్తుత సంవత్సరంలో కొత్తగా 32 మంది బిలియనీర్ల జాబితాలోకి చేరారని తెలిపింది. 2015 నుంచి శ్రీమంతుల సంఖ్య 123 శాతం చొప్పున పెరగడం విశేషం. కుటుంబ వ్యాపారాలు వారీ సంపద పెరగడానికి కీలక పాత్ర పోషించిందని, ముఖ్యంగా భారత్‌లో ఇంచుమించు అన్ని వ్యాపారాల్లో కుటుంబ బిజినెస్‌లు అధికంగా ఉన్నాయని వెల్లడించింది.

## పరవాడ మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల లో మెగా పేరెంట్స్ మీటింగ్

**– ముఖ్య అతిధిగా రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు**



తొలి అడుగు పరవాడ డిసెంబర్ 7 : మండల కేంద్రమైన పరవాడ బీసీ కాలనీ లో మండల పరిషత్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు హాజరయ్యారు.ఆ తరువాత అక్కడ చదువుకునే విద్యార్థులతో మాట్లడి, ఆ విద్యార్థుల ఆలోచనలు, ఆసక్తిని అడిగి తెలుసుకుని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మీరు అనుకున్న విజయాలు దిశగా అడుగులు వేయాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు పెంచవలసిన విధానం వారి చదువులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, చదువు అన్నింటికంటే పెద్ద ఆస్తి అని పిల్లలు బాగా చదువుకునేలా అటు టీచర్లు ఇటు తల్లిదండ్రులు కూడా సహకరించాలని అన్నారు. పిల్లలకు మొబైల్ ఫోన్స్ ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు, టీచర్స్ కూడా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత 65 శాతం నుండి 100% తీసుకు వెళ్లేలా టీచర్లతోపాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, తల్లిదండ్రులు ఈ యొక్క కార్యక్రమానికి వచ్చి పిల్లల సంతోషంలో భాగస్వాములు అయ్యారని తమ అమూల్యమైన సందేశం ఇచ్చారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు, సహపంక్తి భోజనాలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శనలతో పాఠశాల అంతా పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, ఎం. ఈ. ఓ – 2 సాయి శైలజ, పైల అప్పారావు (టి.వి) పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణ వేణి, పైల రామ చంద్రరావు, పైల హరీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## పరవాడ ఫార్మాసిటీ విజయ శ్రీ ఆర్గానిక్స్ కంపెనీ లో ప్రమాదం





తొలి అడుగు పరవాడ డిసెంబర్ 7 : పరవాడ మండలం ఫార్మాసిటీలో విజయ శ్రీ ఆర్గానిక్స్ కంపెనీ లో శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో వద్ద ఏజిటెటర్ నచ్చ్ ఫిల్టర్ డ్రయ్యర్ (ఏ.ఎన్.ఎఫ్.డి) 103 వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయడంతో పాటు గాయపడ్డ ఇద్దరు కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన ఎన్ ఎం ఆర్ కార్మికుడు రాజు (25)కు రెండు చేతులు 30 శాతం కాలిపోయాయి. పరవాడ మండలం భారణికం పంచాయతీ బాపడ పాలెం గ్రామానికి చెందిన సిహెచ్ వెంకట సత్య సుబ్రహ్మణ్య స్వామి (59) (ఆపరేటర్) తలపై చిన్న గాయాలు తగిలాయి. ఇతను మరో 3 నెలల్లో రిటైర్ అవుతారు. వీరు విశాఖ ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలని వైద్య సహాయం పూర్తిగా యాజమాన్యమే చేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు. అనంతరం గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట సత్య సుబ్రహ్మణ్యస్వామి, రాజును సిఐటియు నాయకులు పరామర్శించారు వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు టి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా.. డి. నాగేష్ నాయక్



తొలిఅడుగు, మాదాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ 107 లో కొద్ది రోజుల క్రితం డి. సురేష్ నాయక్ అకాల మరణం తో మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మంచి నాయకుడినీ వదిలిందని గుర్తు చేస్తూ...సురేష్ నాయక్ కి నివాళులు అర్పించారు.అనుకోకుండా అకాల మరణం కాంగ్రెస్ పార్టీ కి గత 30 సంవత్సరాలు గా పార్టీ కి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్ట్ కి కట్టుబడి సేవ చేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భావించి కాంగ్రెస్ పార్టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,డీసీసీఅధ్యక్షుడు చల్లా నరసింహ లు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి సురేష్ నాయక్ తమ్ముడు అయినటువంటి డి. నాగేష్ నాయక్ గతంలో మాదాపూర్ డివిజన్ నుండి కార్పొరేటర్ గా కాంటెస్టెడ్ చేసిన అనుభవం వుంది అలాగే ప్రజలతో మమేకం అయ్యే గుణం వారి కుటు%శీ%బానికి ఉందని డి. నాగేష్ నాయక్ కి మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్ట్ అధ్యక్షుడిగా నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాగేష్ నాయక్ మట్లాడుతూ.. నాపై నమ్మకం తో పార్టీ గుర్తించి నాకు ఆ పదవి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అలాగే కాంగ్రెస్ పార్టీ కి తప్పకుండా నా వంతు కృషి చేసి ప్రజలకి వద్దకి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ లు చెరవేర్చేలా పార్టీ కి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా యంబిసి కార్పొరేషన్ ఛైర్మెన్ జేరిపాటీ జైపాల్ ,శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ రఘునందన్ రావు మట్లాడుతూ... మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టి కి కరుడు కట్టిన నాయకుడు ఎవరు అంటే సురేష్ నాయక్ కుటుంబం అని గుర్తు చేశారు.సురేష్ నాయక్ సేవలు గుర్తించి తన కుటుంబానికి అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం చాలా సంతోషమని అన్నారు.

## మంచి విలువలతో కూడిన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

తొలి అడుగు, జంగారెడ్డిగూడెం డిసెంబర్ 7: జంగారెడ్డిగూడెంలో పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమ్మేళనలలో ఆర్డీవో ఎంవి రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు సమాజంలో మంచి పౌరుడిగా నిలిపేందుకు విద్యార్థులనుతీర్చిదిద్దాలని,ఉపాధ్యాయులు పిల్లలకు చదువు నేర్పించడంఒక బాధ్యత అయితే తల్లిదండ్రులుగా ఆ పిల్లల విద్యాభ్యాసన, వారిలో టాలెంట్ ఇతర అంశాలను పరిశీలించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులను బాధ్యత కలిగిన పౌరుడిగా తీర్చిదిద్దడంలో పాఠశాలకు ఎంతో బాధ్యత ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దరుతో పాటు దేశానికి అవసరమైన ఉత్తమ పౌరులను అందించే దిశగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని అన్నారు. గురుకుల పాఠశాలలో విద్యాబోధన ఇతర కార్యక్రమాల నిర్వహణపై ఆర్టీవో సంతృప్తి వ్యక్తం చేశారు ఇంకా ఏమైనా సమస్యలు గానీ ఇబ్బందులు గాని ఉంటే విద్యార్థుల తల్లిదండ్రులను నిర్భయంగా తెలియజేయచ్చని తెలిపారు. పిల్లలందరిని చూడగానే ఎంతో సంతోషం కలిగిందని పెద్ద ఎత్తున తల్లిదండ్రులు హాజరు కావడం మంచి పరిమాణం అని తొలివలత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థుల ప్రదర్శన ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి అరుణ, ఉపాధ్యాయులు, స్కూల్ పిల్లలు, పేరెంట్స్ మొదలగు సిబ్బంది పాల్గొన్నారు.

